మంత్రి జార్జ్ ఆప్తులకు ఐటీ షాక్

● జీతు, కొఠారి కార్యాలయాలపై దాడులు

బెంగళూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి కేజే జార్జ్‌కు ఆప్తులైన ఇద్దరు వ్యాపారులకు ఐటీ అధికారులు షాక్ ఇచ్చారు. వారి కార్యాలయాలు, నివాసాలపై ఐటీ అధికారులు బుధవారం దాడులు కొనసాగించారు. రెండు రోజులుగా ప్రక్రియ కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. జీతేంద్ర నిర్వాణికి చెందిన ఎంబస్సీ గ్రూప్‌తోపాటు కొఠారి అనే వ్యాపారి ఇంటిపైనా దాడులు చేశారు. ఇద్దరికి సంబంధించి పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.



సమీక్షలో సీఎం సిద్ధరామయ్య, మంత్రి జమీర్ తదితరులు

రెండోరోజూ కొనసాగిన సీఎం సమీక్షలు

బెంగళూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేలు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులతో రెండోరోజూ సీఎం సిద్ధరామయ్య సమీక్షలు కొనసాగించారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి దాకా సమీక్షలు కొనసాగాయి. ఉదయం బీదర్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఈశ్వర్‌ఖండ్రె ఆధ్వర్యంలో జిల్లా ఎమ్మెల్యేలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత కలబురగి జిల్లాకు సంబంధించిన అంశాలపై చర్చలు కొనసాగాయి. మంత్రులు ప్రియాంక ఖర్గే, శరణ్‌ప్రకాశ్ పాటిల్‌తోపాటు కల్యాణ కర్ణాటక అభివృద్ధి మండలి చైర్మన్ అజయ్‌సింగ్ పాల్గొన్నారు. ఆ తర్వాత యాదగిరి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శరణబసప్ప దర్శనాపురతోపాటు జిల్లా ఎమ్మెల్యేలతో సమీక్ష జరిపారు. అనంతరం రాయచూరు జిల్లా ఎమ్మెల్యేలతో సమీక్ష కొనసాగింది. కొప్పళ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శివరాజ్ తంగడిగితోపాటు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. మధ్యాహ్నం విజయనగర జిల్లా ఎమ్మెల్యేల సమీక్షలో గృహ నిర్మాణశాఖ మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు. సాయంత్రం బళ్లారి జిల్లా ఎమ్మెల్యేలతో సమీక్ష జరిగింది. ఎమ్మెల్యేలు నాగేంద్రతోపాటు పలువురు పాల్గొన్నారు. బెళగావి జిల్లాకు చెందిన సీనియర్ మంత్రులు సతీశ్‌జార్కిహోళి, లక్ష్మీ హెబ్బాళ్కర్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. అనంతరం హుబ్బళ్ళి-ధారవాడ, ఉత్తరకన్నడ ఎమ్మెల్యేలతో సమీక్ష జరిగింది. ఒకేరోజున ఉత్తరకర్ణాటక జిల్లాల సమీక్షకు ప్రాధాన్యం ఇచ్చారు.

ధర్మం కోసమే కాషాయ శాలువా..!

● మూడేళ్ల తర్వాత కాంగ్రెసో.. బీజేపీనో.. చూద్దాం


● ఎమ్మెల్యే నయన మోటమ్మ



వేదికపై శ్రీరామసేన వ్యవస్థాపకుడు ప్రమోద్ ముతాలిక్‌తో ఎమ్మెల్యే నయన

బెంగళూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): హిందువుగా దళిత సమాజంలో మూడగెరెలో జన్మించానని, భవిష్యత్తులో బీజేపీకి వెళ్తానో కాంగ్రెస్‌లో ఉంటానో, బీఎస్పీ లేదా ఎస్‌డీపీఐలో చేరుతానో అనేది వేచిచూద్దామని మూడిగెరె కాంగ్రెస్ ఎమ్మెల్యే నయన మోటమ్మ అన్నారు. బుధవారం మూడిగెరెలో హిందూమహాసభ ఆధ్వర్యంలో గణపతి సమితి సమావేశంలో లోగో విడుదల చేశారు. శ్రీరామసేన వ్యవస్థాపకులు ప్రమోద్ ముతాలిక్‌తో కలసి వేదిక పంచుకున్న వేళ ఆమె కాషాయం శాలువా ధరించారు. ఇదే సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తాను గణపతికోసం ధర్మంకోసం వచ్చానని, ఎమ్మెల్యేగా పార్టీ ప్రతినిధిగా వ్యవహరించేది ఆ తర్వాత అన్నారు. గణపతి సమితి కార్యాధ్యక్షురాలిగా హాజరయ్యానన్నారు. ఏ పార్టీవారు అనేది ఇక్కడ ముఖ్యం కాదన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్నానని, దాంతోపాటు పలు అస్థిత్వాలతో కలిపి నయన మోటమ్మ అయ్యానన్నారు. పుట్టుక తర్వాతనే కులం, మతం, ఆడ, మగగా నిర్ధారణ అవుతుందని అంతమాత్రాన అన్నింటికీ విమర్శలు సరికాదన్నారు.

తవ్వకాల్లో బయటపడిన 17వ శతాబ్దం నాటి శాసనాలు



శాసనాలను చూపుతున్న పురావస్తు శాఖ అధికారులు

గంగావతి రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): గంగావతి తాలూకా బంకాపురం వద్ద బుదవారం పురావస్తు శాఖ తవ్వకాలు చేస్తుండగా 17వ శతాబ్దపు నాటి రెండు శాసనాలు బయపడినట్లు పరిశోధకుడు శరణబసప్ప తెలిపారు. కనకగిరి రెండవ పాలకుడు ఇమ్మడి ఉడుచప్ప నాయక కాలంలోని రెండుశాసనాలు బయటపడ్డాయన్నారు. శాసనంలో తండ్రి కనకయ్యనాయక, తాత కెళవాడి ఉడచనాయక అని ఉంది. గత కాలంనాటి నాయకుల చరిత్ర వారి పరిపాలన విధానం చారిత్రక అంశాలు ఈశిలపై లిఖించబడి ఉన్నాయని పురావస్తుశాఖ పేర్కొంది. గంగావతికి చెందిన ప్రొఫెసర్ బసవరాజ్, డాక్టర్ సురేశ్‌గౌడ, హరనాయకుడు శాసనాల అన్వేషణలో పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు.. నివేదిక సిద్ధం..!

● 60వేల ఉద్యోగాల భర్తీలో జాప్యం

● నేడు సమర్పించనున్న రిటైర్డ్ జడ్జి జస్టిస్ నాగమోహన్‌దాస్



హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ హెచ్‌ఎన్ నాగమోహన్‌దాస్



బెంగళూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఎస్సీ సామాజికవర్గంలో ఉపకులాల జనాభాను ఖరారు చేసి అందుకు తగ్గట్టుగా రిజర్వేషన్లు వర్తింపచేసేందుకు కొన్నేళ్లుగా సాగుతున్న వర్గీకరణ పోరాటానికి పలు రాష్ట్రాలు సుముఖత వ్యక్తం చేస్తూ సర్వేలు చేపట్టాయి. ఇప్పటికే తెలంగాణలో అమలు చేయగా కర్ణాటక ప్రభుత్వం వర్గీకరణ అమలు చేసేందుకు సిద్ధమైంది. అందుకు అనుగుణంగానే హైకోర్టు మాజీ న్యాయమూర్తి హెచ్‌ఎన్ నాగమోహన్‌దాస్ నేతృత్వంలోని ఏకసభ్య విచారణ కమిషన్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. తొలుత 15రోజులు గడువు ఇవ్వగా ఆ తర్వాత మూడుసార్లు పొడిగించి సర్వే పూర్తి చేశారు. జూలై ఆఖరులోగా నివేదిక సమర్పించాలని గడువు ఉండేది. అందుకు అనుగుణంగానే గురువారం సీఎం సిద్దరామయ్యకు వర్గీకరణకు సంబంధించి జరిపిన సర్వే నివేదికను సమర్పించే అవకాశాలు ఉన్నాయి. మాదిగ, ఉపకులాల నుంచి ఒత్తిడి వచ్చే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. నివేదిక స్వీకరించినా వెంటనే అమలు చేస్తారా..? లేక కులసంఘాలనుంచి ఒత్తిడి వస్తే అధ్యయనం, సాంకేతిక కారణాలు చూపి మరింతకాలం వాయిదా వేస్తారా..? అనే ఉత్కంఠ నెలకొంది. సీఎం సిద్ధరామయ్య 2015లో కులగణన సర్వే జరిపించారు. కొన్ని నెలల వ్యవధిలోనే ప్రక్రియ ముగిసినా ఆ తర్వాత అమలుకు నోచుకోలేదు. తీరా పదేళ్లు ముగిసిందని అధిష్ఠానం సూచనలతో వందలకోట్లు రూపాయలు ఖర్చు చేసి జరిపిన సర్వేకు మంగళం పలికారు.

మూడు దశాబ్దాల పోరాటం..

ఎస్సీ వర్గీకరణ అంశం మూడు దశాబ్దాల పోరాటం. జాప్యానికి కారణం ఏమిటంటే సంబంధిత వర్గాలకు సాంకేతికంగా కొన్ని రహస్యాలు దొరికాయి. జనాభా దృష్ట్యా ఎక్కువ సంఖ్యలో ఉన్న నిరక్షరాస్యులు, అజ్ఞానం, పేదరికం, రాజకీయ చైతన్యం లేకపోవడం, న్యాయ సమ్మతమైన రిజర్వేషన్ల వాటాను పొందలేకపోయారు. ఈ పరిస్థితికి మనకు మనమే కారణమనేది సమాజానికి చెందిన ప్రముఖులకు తెలిసిన విషయమే. సామాజిక న్యాయం కోసం సదరు వర్గాలు ఎదురుచూస్తున్నాయి. రిజర్వేషన్ సౌకర్యాలు పంచుకుని అనుభవించే విషయంలో వెనుకడుగు లేదు. కానీ సమగ్రమైన అవగాహన, నమ్మకం లేకపోవడం, దళితులలోని రెండు వర్గాల మధ్య అగాధం సృష్టించారని, ఇదే అవకాశంగా కొంతమంది నిరంతరంగా పదవులు, తదితర సౌకర్యాలు పొందుతూ వచ్చారనే అభిప్రాయం చాలామందిలో ఉంది.

ప్రముఖ వర్గాల మధ్య సఖ్యత కరువు

వర్గీకరణ విషయంలో ఎస్సీ జాబితాలో 101 ఉపకులాలపైకి ప్రముఖమైన వర్గాల మధ్య సఖ్యత లేదు. దీంతో ఎస్సీ మంత్రులు, ఎమ్మెల్యేలు మాత్రమే ప్రముఖులకు వాస్తవాన్ని తెలిపి సఖ్యత సాధించేదిశగా సీఎం ప్రయత్నాలు చేసినట్టు తెలుస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసి ఆగస్టు 1కి ఏడాది అవుతోంది. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, హర్యానా ప్రభుత్వాలు ఇప్పటికే ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరించాయి. ఇలా సామాజిక న్యాయానికి కట్టుబడిన ప్రభుత్వమే వెనుకడుగు వేస్తోందనే తప్పుడు సందేశం ఇచ్చినట్టు అవుతోంది. ఇప్పటికే పోరాటానికి నిర్ణయించిన ప్రతిపక్షాల చేతికి అస్త్రాలు ఇచ్చినట్టు అవుతుందనే సీఎంకు ఇంటెలిజెన్స్ సూచించినట్టు తెలుస్తోంది. వర్గీకరణకు అభ్యంతరం తెలిపే ఉపకులాలను వదిలి ఎస్సీలకు 17శాతం రిజర్వేషన్‌లో 6శాతం మాకు కేటాయించాలని ప్రభుత్వాన్ని మాదిగ సమాజానికి చెందిన నాయకులు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో 1.16 కోట్లమంది ఎస్సీ జనాభాలో మాదిగలతోపాటు 49 ఉపకులాలకు సంబంధించి 65 లక్షలమంది ఉన్నారు. తమిళనాడు తరహాలో అనుసరిస్తే అనవసరమైన జాప్యం తప్పుతుంది. వర్గీకరణ సమస్య పరిష్కారం అవుతుంది. రాజకీయ లాభనష్టాల కారణంగా మూడు దశాబ్దాల పోరాటానికి ఫలితం లభిస్తుందని భావిస్తున్నాయి.

బొమ్మై ప్రభుత్వంలో రిజర్వేషన్ల అమలు

బొమ్మై ప్రభుత్వంలో రిజర్వేషన్లు అమలు చేశారు. అందులో మాదిగ, ఉపకులాలకు 6శాతం, చలవాదితోపాటు ఉపకులాలకు 5.5శాతం, లంబాణి, బోవి, కొరమ, కొరచ 4.5శాతం, మిగిలిన ఉపకులాలకు ఒకశాతంగా కేటాయించారు. ఎస్సీ కులానికి రిజర్వేషన్ ప్రమాణం 15 కాకుండా 17శాతానికి పెంచేలా నాగమోహన్‌దాస్ నివేదికలో స్పష్టత ఇవ్వనున్నారు. గతంలో ఈయన నేతృత్వంలోనే ఎస్సీ రిజర్వేషన్ 15 నుంచి 17శాతానికి, ఎస్టీ రిజర్వేషన్ 4 నుంచి 7శాతానికి పెంచుతూ సిఫారసు చేస్తూ నివేదిక ఇచ్చారు. గతంలో బీజేపీ ప్రభుత్వం ఈ నివేదికను అంగీకరించి ఎస్సీలకు 17శాతానికి పెంచింది. కాగా న్యాయమూర్తి సదాశివ కమిషన్ నివేదిక సిఫారసులు, 2011 జనాభా ఆధారంగా జేసీ మాధుస్వామి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసమితి నివేదిక ప్రకారం ఎస్సీ వర్గీకరణ కల్పించేందుకు నిర్ధారించి కేంద్రానికి సిఫారసు చేశారు. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ ముగిసేవరకు ప్రభుత్వం ఉద్యోగ నియామకాలకు బ్రేక్ పెట్టింది. గత అక్టోబరు నుంచి స్తంభింపచేశారు. విద్య, అగ్రికల్చర్‌తోపాటు వివిధశాఖలలో ఖాళీల భర్తీ ప్రస్తావన సిద్ధం చేశారు. మొత్తంగా 60వేల ఉద్యోగాల భర్తీకి బ్రేక్ పడింది. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ నివేదిక పొందిన వెంటనే మంత్రివర్గంలో ఆమోదించి ప్రభుత్వం 20 రోజుల్లో వర్గీకరణకు అనుగుణంగా రిజర్వేషన్లు అమలు చేస్తారని, మరో నెలరోజుల్లో ఉద్యోగాల నియామక ప్రక్రియ ప్రారంభం అవుతాయని భావిస్తున్నారు. కాగా ఇటీవల సీఎం సిద్దరామయ్య త్వరలోనే వర్గీకరణ నివేదిక పొంది ఉద్యోగాలను భర్తీ చేస్తామని సన్నిహితుల వద్ద అభిప్రాయం వ్యక్తం చేశారు. నాగమోహన్‌దాస్ కమిటీ నివేదికను సమర్పించిన వెంటనే జాప్యం లేకుండా అమలు చేయాలని ప్రభుత్వం కూడా సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఇందుకు దళిత సామాజికవర్గానికి చెందిన మంత్రులు అమలు చేయించేందుకు ముఖ్యమంత్రిపై ఒత్తిడి తీసుకురాదలిచారు.



పరిశీలనకు వెళ్తున్న సిట్ అధికారులు

ధర్మస్థళలో కొనసాగుతున్న ఉత్కంఠ

● రెండోరోజూ తవ్వకాల్లో లభించని ఆనవాళ్లు

బెంగళూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ధర్మస్థళలో ఉత్కంఠ కొనసాగుతోంది. వందకుపైగా శవాలను పాతిపెట్టానని మాజీ పౌర కార్మికుడి ఫిర్యాదుకు అనుగుణంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ కార్యాచరణను ముమ్మరం చేసింది. రెండు రోజులపాటు విచారణలు, ధర్మస్థళ పరిధిలో శవాలను పాతిపెట్టిన స్థలాలను మాజీ పౌరకార్మికుడి ద్వారా గుర్తించారు. 13 స్థలాలను ఖరారు చేసుకున్నాక వాటికి సరిహద్దులుగా కంచె తరహాలో టేప్ వేశారు. బుధవారం రెండురోజూ తవ్వకాల పనులు కొనసాగించారు. మాజీ పౌరకార్మికుడితోపాటు అతడికి అనుబంధమైన న్యాయవాదుల సమక్షంలోనే సిట్ అధికారులు, సాయుధ బలగాలతో కలసి దక్షిణకన్నడ జిల్లా పోలీసుల సహకారంతో కొనసాగించారు. రెవెన్యూ, ఫోరెన్సిక్, అటవీశాఖ ఉద్యోగులు వారి వెంట ఉన్నారు. మంగళవారం నేత్రావతి నది సమీపంలో తవ్వకాలు జరిపారు. నాలుగైదు అడుగులు తవ్వినా ఆనవాళ్లు లేకపోవడంతో పొక్లెయిన్ల ద్వారా 8 అడుగుల వెడల్పు, 15 అడుగుల లోతు దాకా తవ్వకాలు కొనసాగాయి. అయితే ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు. ఇక బుధవారం 2, 3, 4, 5 స్థలాలలో తవ్వకాలు కొనసాగాయి. సిట్ దర్యాప్తు చీఫ్ ప్రణబ్ మహంతి, అధికారి అనుచేత్ పర్యవేక్షణలో ప్రక్రియ సాగింది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం దాకా కార్యాచరణ కొనసాగింది. కానీ ఎక్కడా అస్థిపంజరాలకు సంబంధించిన ఆనవాళ్లు లభించలేదు. తవ్వకాలు జరుగుతుండడంతో ధర్మస్థళ ప్రాంతానికి చెందిన వారిలో ఉత్కంఠ కొనసాగుతోంది. స్థానికులు పెద్ద ఎత్తున తవ్వకాలు జరిగే ప్రాంతాల్లో ఎదురుచూస్తున్నారు. ఏదైనా సమాచారం దొరకనుందా..? అనే కోణంలో చూస్తున్నారు. మరోవైపు ఇదంతా బోగస్ అని కుట్రతోనే ఇలాంటి చర్యలు కొనసాగుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. కాగా సిట్ చీఫ్ ప్రణబ్ మహంతికి కేంద్రప్రభుత్వ సర్వీసులకు ఎంపిక కావడంతో ఆయన స్థానంలో ఎవరిని నియమిస్తారనేది కుతూహలమైంది.



తవ్వకాల్లో పాల్గొన్న ఫిర్యాదిదారుడు (ముసుగు వ్యక్తి)

ఆగివున్న లారీని ఢీకొన్న ప్రైవేట్ బస్సు

● ఇద్దరి దుర్మరణం.. 15 మందికి గాయాలు

● శివమొగ్గ జిల్లాలో దారుణం



లారీని ఢీకొన్న ప్రైవేటు బస్సు

బెంగళూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఆగివున్న లారీని వేగంగా వచ్చిన ప్రైవేట్ బస్సు ఢీ కొనడంతో ఇద్దరు ప్రయాణికులు మృతి చెందగా 15మంది తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మంగళూరు నుంచి చిత్రదుర్గ జిల్లా చెళ్లకెరెవైపు వెళ్లిన దుర్గాంబ ప్రైవేట్ బస్సు గాజనూరు వద్ద మరమ్మతులకు గురై రోడ్డుపక్కన ఆగివున్న లారీని గమనించకుండా ఢీకొంది. తెల్లవారుజామున 3 గంటలవేళ వర్షంతోపాటు మంచు ఉండడంతో లారీని బస్సు డ్రైవర్ గుర్తించలేకపోయాడు. ప్రమాదంలో బస్సు కండెక్టర్ అణ్ణప్ప (40), చెళ్ళకెరె నివాసి హర్షిత్(35) సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. గాయపడినవారిని శివమొగ్గలోని మెగ్గాన్ ఆసుపత్రికి తరలించారు. శివమొగ్గ-మంగళూరు జాతీయ రహదారి 169ఏపై ట్రాఫిక్ స్తంభించింది. తుంగానగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

మన విద్యపై విదేశీయుల్లో పెరుగుతున్న ఆసక్తి

● శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ 16వ సంస్థాపన ఉత్సవాల్లో వక్తలు



8

ఉత్తరాదిని వణికిస్తున్న వానలు..!

● పొంగి ప్రవహిస్తున్న నదులు ● నీట మునిగిన గ్రామాలు ● వంతెనలపై ప్రవహిస్తున్న నీరు

బళ్లారి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఉత్తర కర్ణాటక జిల్లాల్లో ఎడతెరపి లేకుండా వానలు కురుస్తున్నాయి. బళ్లారి, విజయనగర, కొప్పళ, రాయచూరు, బాగల్‌కోట, బెళగావి జిల్లాల్లో నదులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. నదుల సమీపంలో ఉన్న గ్రామాలు నీట మునిగాయి. జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. వంతెనలపై నీరు పారుతున్నాయి. దీంతో రాకపోకలు స్తంభించాయి. కొన్నిచోట్ల దేవాలయాల్లోకి నీరు చేరాయి. ఘటప్రభ నదిలో వరద నీరు విపరీతంగా పెరిగింది. బాగల్‌కోట జిల్లాలోని ముధోల్ తాలూకాలో నదిపై నిర్మించిన 8 వంతెనలు, అలాగే బ్యారేజీలు మునిగిపోయాయి. వరద కారణంగా ముధోల్ పరిసరాల్లోని మిర్జి, మలాలి, ఒంటిగోడ, మాచేనూర్ ఇతర గ్రామాలు నీటిలో చిక్కుకున్నాయి. మాచనూర్ గ్రామంలోని హోళేబసవేశ్వర ఆలయం నీట మునిగింది. భక్తులు ఆలయంలోకి వెళ్లడం కష్టంగా మారడంతో ఒడ్డునే దర్శనం చేసుకుని వెళుతున్నారు. బళ్లారి జిల్లా కంప్లి, కొప్పళ జిల్లా గంగావతి మధ్య తుంగభద్ర నది పొంగి ప్రవహిస్తోంది. నదిలో 1.10 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నాయి. గంగావతి, కంప్లి ప్రాంతాల్లో మూడు రోజులుగా వంతెనలు నీటిలోనే ఉన్నాయి. రాకపోకలు నిల్చిపోయాయి. కంప్లి నుంచి గంగావతి వైపు వెళ్లే విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడం లేదు. గర్భిణులు, రోగులు వైద్యం కోసం గంగావతికి కాకుండా బళ్లారికి వెళుతున్నారు. కంప్లి, సిరుగుప్ప రహదారిపై నారిహళ్లి వంతెన నీటమునిగింది. వరద కాస్త తగ్గుముఖం పట్టినట్టే పట్టి తిరిగి పెరుగుతుండడంతో జనజీవనం అతలాకుతలం అయింది. రైతులు ఎవరూ అటువైపు వెళ్లడం లేదు. ఇక నది ఆధారంగా జీవనం సాగించే వారు కూడా నదివైపు వెళ్లరాదని అధికారులు ఆదేశించారు. ఉత్తర కర్ణాటక జిల్లాల్లో నుంచి వివిధ ప్రాంతాలకు రవాణా వ్యవస్థ స్తంభించింది.



కొప్పళ జిల్లా గంగావతి, బళ్లారి జిల్లా కంప్లి మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర నది



ముధోల్ తాలూకా మచ్చనూర్ వద్ద హోళేబసవేశ్వర ఆలయాన్ని చుట్టుముట్టిన నీరు



ఘటప్రభ నది వరద ఉధృతికి బాగల్‌కోట జిల్లా ముధోల్ వద్ద వంతెన పైనుంచి ప్రవహిస్తున్న నీరు

అనాథ పిల్లలను దత్తత తీసుకున్న మంత్రి సవిత



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

గోరంట్ల, జూలై30(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనాథ పిల్లలను దత్తత తీసుకుంటున్నట్లు మంత్రి సవిత బుధవారం ప్రకటించారు. గోరంట్లలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బంగారుకుటుంబం పీ4 సర్వేలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఎంతోమంది సంపన్నులు, ఉద్యోగులకు ఇతరులకు సేవ చేయాలని ఉన్నా, ఎలా చేయాలో తెలియని స్థితిలో ఉన్నారన్నారు. అలాంటి వారి కోసమే రాష్ట్ర ప్రభుత్వం పీ-4 విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. అధిక సంఖ్యలో మార్గదర్శకులుగా చేరి గోరంట్లను జిల్లాలోనే నెంబర్ వన్ మండలంగా తీర్చిదిద్దాలన్నారు. ఆర్డీవో సువర్ణ పది కుటుంబాలు, తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ నరేంద్రలు ఐదు కుటుంబాల వంతున దత్తత తీసుకున్నారు. టీడీపీ నాయకులు నిమ్మల శ్రీధర్ 10, నాగరాజు 11, సోముశేఖర్, నాగేనాయక్ 10వంతున, సుబ్బారెడ్డి 42, మహమ్మద్ 3, గిరిధర్ 10, షాకీర్ బాషా 5, పచ్చా అశోక్, నరేష్, బాలక్రిష్ణలు 5 కుటుంబాల వంతున దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, డీపీఓ సమత, పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప, తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ నరేంద్ర, సీఐ శేఖర్, ఎన్డీఏ నాయకులు, డీలర్లు, వ్యాపారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పోలీసుల అదుపులో వడ్డీ వ్యాపారులు?

ధర్మవరం, జూలై 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన చేనేత కార్మికుడు రమణ, భారతి దంపతులపై దాడిచేసిన వడ్డీ వ్యాపారులు నలుగురు పోలీసుస్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలిసింది. చేనేత కార్మికుడు రమణపై దాడి జరిగిన రోజే టూటౌన్ సీఐ రెడ్డప్ప ఏడుగురిపై కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి నిందితులు పరారీలో ఉన్న విషయం తెలిసిందే. నిందితులను గురువారం అరెస్టు చూపించనున్నట్లు తెలిసింది.

పాముకాటుకు బాలుడి బలి


హితన్ మృతదేహం

పెనుకొండటౌన్, జూలై30(ఆంధ్రజ్యోతి): పాముకాటుతో ఎనిమిదేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన బుధవారం పెనుకొండలో జరిగింది. అర్బన్ కాలనీలో నివాసముంటున్న మహేష్, సుకన్య దంపతులకు కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా పాము జొరబడి హితన్(8)ను కాటు వేసింది. నొప్పితో బాలుడు అల్లాడుతుండగా కుటుంబ సభ్యులు లేచి చూసేసరికి మూలాన పాము ఉండటం గుర్తించారు. వెంటనే దానిని చంపి బాలుడిని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం 108లో అనంతపురం తరలిస్తుండగా మృతి చెందినట్లు కుటుంబికులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

క్వారీ కొండపై నుంచి పడి ఆపరేటర్ మృతి

గుత్తిరూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండంలోని జక్కలచెరువు గ్రామ సమీపంలో కంకర క్వారీ కొండపై నుంచి పడి ఆపరేటర్ రఘురామ్(35) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ముదిగుబ్బ మండలం నాగలగుబ్బల గ్రామానికి చెందిన రఘురామ్ కంప్రెషర్ ఆపరేటర్‌గా పని చేస్తుండేవాడు. బుధవారం మధ్యాహ్నం క్వారీలో కొండపై ఘాతం పెడుతుండగా, కంప్రెషర్ మిషన్ కదుతుండటంతో దాన్ని అదుపు చేసేందుకు రఘురామ్ అక్కడికి వెళ్లాడు. అయితే అక్కడ ప్రమాదవశాత్తు కాలుజారి కొండపై నుంచి క్వారీలోని రాళ్లపై పడి, మృతి చెందాడు. ఎస్ఐ సురేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృత్యుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

మహిళ ఆత్మహత్య


దివ్యకుమారి (ఫైల్)

గుంతకల్లుటౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భాగ్యనగర్‌కు చెందిన దివ్యకుమారి(35) బుధవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు... దివ్యకుమారి, చంద్రశేఖర్‌లు ప్రేమించి 2013లో వివాహం చేసుకున్నారు. చంద్రశేఖర్ గుత్తిరోడ్డులోని రైస్ షాపులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. దివ్యకుమారి ఆరు నెలల నుంచి కడుపునొప్పితో బాధపడుతుండేది. పలుచోట్ల వైద్యం చేయించిన నయం కాకపోవడంతో తీవ్రంగా మనస్తాపం చెందింది. ఉదయం భర్త షాపునకు, ఇద్దరు పిల్లలు స్కూల్‌కు వెళ్లారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో దివ్యకుమారి ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుంది. మధ్యాహ్నం భర్త చంద్రశేఖర్ ఇంటికి వచ్చి చూడగా దివ్యకుమారి ఉరికి వేలాడుతూ కన్పించింది. ఆమెను కిందకు దింపి, పరీక్షించగా చెందిందన్నారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పిచ్చికుక్క దాడి.. ఏడుగురికి గాయాలు


కుక్కకాటుకు గురైన చిన్నారి లాస్య

యల్లనూరు, జూలై30(ఆంధ్రజ్యోతి): మండలంలో ఓ పిచ్చికుక్క రెండు రోజుల వ్యవధిలోనే ఏడుగురిని గాయపరిచింది. స్థానిక కేజీబీవీలో మంగళవారం ముగ్గురిని గాయపరిచిన కుక్క బుధవారం ఉదయం కృష్ణాపురం గ్రామంలో ఒక వృద్ధురాలు, మహిళను కరిచింది. వెన్నపూసపల్లిలో ఆడుకుంటున్న రెండు సంవత్సరాల చిన్నారి లాస్యను తీవ్రంగా గాయపరిచింది. అదే కాలనీలో మరో ఇద్దరిని కరిచింది. గాయపడ్డ వారిని 108వాహనంలో యల్లనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కృష్ణాపురంలో వృద్ధురాలు రాములమ్మ కుక్క కరిచే సమయంలో కిందపడటంతో కాలు కూడా విరిగినట్లు బాధితులు తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టండి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధికారి నాగలక్ష్మి

రొద్దం, జూలై 30(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలను అరికట్టాలని జిల్లా ఉమెన్స్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికా రి నాగలక్ష్మి సూచించారు. బుధవారం రొద్దం ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని సచివాలయాల ఉద్యోగులు, అంగన్‌వాడీ వర్కర్లతో బాల్య వివాహాలపై అవగాహన సదస్సును ఏర్పాటు చే శారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి సచివాలయ పరిధిలోనూ 11 మందితో కమిటీ ఏర్పాటు చేసి బాల్య వివాహాలను అరికట్టడానికి ఉద్యోగులు తగు చర్యలు చేపట్టాలన్నారు. బాలలపై లైంగిక వేధింపులను అరికట్టేందుకు గ్రామస్థాయిలో బాల్య వివాహ నిరోధక కమిటీ బాధ్యతలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాంకుమార్, జిల్లా అధికారి మురళీధర్, ఈఓఆర్డీ గోవిందప్ప, సోషల్‌వర్కర్ వనజాక్షి, కార్యదర్శి బా బు, జనార్దన్, లక్ష్మీనారాయణ, హెచ్‌ఎం వెంగప్ప పాల్గొన్నారు.

శక్తిస్వరూపిణి

- అతివలకు అండగా శక్తి టీమ్స్
- యాప్‌లో ఫిర్యాదు చేస్తే చాలు తక్షణ సాయం
- అఘాయిత్యాలు, మోసాలపై అవగాహన
- నిర్మానుష్య ప్రదేశాల్లోనూ డ్రోన్లతో నిఘా


కేజీబీవీలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న శక్తి టీమ్ సభ్యులు

అనంతపురం క్రైం, జూలై 30(ఆంధ్రజ్యోతి): మహిళలపై దాడులు, అఘాయిత్యాలు, వేధింపుల నిరోధానికి జిల్లా పోలీస్ యంత్రాంగతం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ప్రత్యేకంగా శక్తి టీమ్‌లను ఏర్పాటు చేశారు. జిల్లాలోని పార్కులు, రద్దీ ప్రదేశాలు, కాలేజీలు, షాపింగ్ మాల్స్ ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో నిఘా ఉంచుతారు. మహిళలు, అమ్మాయిలకు వేధింపుల నుంచి రక్షణ పొందడంపై శక్తి టీమ్స్ సభ్యులు అవగాహన కల్పిస్తున్నారు. ఎక్కడైనా ఒంటరి మహిళలను వేధిస్తుంటే డ్రోన్ నిఘా ద్వారా గమనించి ఆయా ప్రాంతాలకు వెంటనే చేరుకుని బాధితులకు శక్తి టీమ్స్ అండగా నిలుస్తాయి. జిలాలో ఏడు శక్తి బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా 7,00126 మంది తమ ఫోన్లో శక్తి యాప్‌ను వినియోగిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్న బృందాలు

మహిళలకు అందుబాటులో ఉన్న భద్రత, రక్షణ అవకాశాలు, సదుపాయాలు, వనరులపై శక్తి టీమ్స్ అవగాహన కల్పిస్తున్నాయి. శక్తి టీమ్స్‌లో కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐ, ఎస్ఐలతో కలిపి ఐదు నుంచి ఏడుగురు సభ్యులు ఉంటారు. ఈ టీం సభ్యులు ఆయా సబ్ డివిజన్ పరిధిలో సంచరిస్తూ ఉంటారు. కళాశాలలు, పార్కులు, స్కూళ్లలోకి వెళ్లి పిల్లలకు శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తారు. బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గుర్తించడం ఎలా..? ఆపదలో ఉన్నప్పుడు శక్తి యాప్‌ను ఎలా ఉపయోగించాలన్న అంశాలపై వివరిస్తారు. పోక్సో యాక్ట్, స్వీయ రక్షణ ఎలా, ఈవ్ టీజింగ్, ప్రేమ వేధింపుల నుంచి ఎలా బయటపడాలి...? తదితర అంశాలపై మహిళలు, యువతులు, బాలికలకు అవగాహన కల్పిస్తారు.

జిల్లాలో ఏడు శక్తి టీమ్స్

జిల్లా వ్యాప్తంగా 7 శక్తి బృందాలను ఏర్పాటు చేశారు. అనంతపురంలో రెండు బృందాలు ఉన్నాయి. అనంతపురం సబ్ డివిజన్ 1, అనంతపురం రూరల్ సబ్ డివిజన్ 1, తాడిపత్రి సబ్ డివిజన్-1, గుంతకల్లు సబ్ డివిజన్ -1, కళ్యాణదుర్గం సబ్ డివిజన్ -1 చొప్పున ఏడు బృందాలను ఏర్పాటు చేశారు. ఈ ఏడు ప్రాంతాల పరిధిలో శక్తి టీమ్స్ సభ్యులు విధులు నిర్వర్తిస్తారు. ఆపద సమయాల్లో శక్తి యాప్‌కు వచ్చే ఎస్ఓఎస్ కాల్స్, డయల్ 100, 112, 181, 1098, 1930కు వచ్చే కాల్స్‌కు వీరు వేగంతా స్పందిస్తారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యలను పరిష్కరిస్తారు.

మహిళల చేతిలో రక్షణ 'శక్తి'

శక్తి యాప్‌లో శరవేగంగా స్పందించే ఎస్ఓఎస్ బటన్ ఉంటుంది. దాన్ని టచ్ చేయగానే బాధితుల సమాచారం పోలీసులకు వెళ్తుంది. అందులో డయల్ 100, 112 ఆప్షనతో పాటు, గ్రీవెన్స్ కంప్లైంట్, రిపోర్ట్ మిస్సింగ్ చిల్డ్రన్, నైట్ షెల్టర్, ఫ్యామిలీ కౌన్సెలింగ్ రిక్వెస్ట్, 799348511 వాట్సప్ నంబర్ తోపాటు, సేఫ్ ట్రావెల్, శక్తి హెల్ప్‌లైన్ ఆప్షన్ బటన్లు ఉంటాయి. వీటిని టచ్ చేయడం ద్వారా సులభంగా, వేగంగా బాధిత మహిళలు, యువతులు, బాలికలు పోలీస్ శాఖ నుంచి సాయం పొందవచ్చు.



శక్తి యాప్ లోగో

అప్రమత్తం చేస్తున్నాం



వేధింపులు, ఇతర అఘాయిత్యాలపై మహిళలు, యువతులను అప్రమత్తం చేస్తున్నాం. శక్తి టీమ్స్ నిత్యం రద్దీ ప్రదేశాలు, కళాశాలలు, స్కూళ్లలో శక్తి యాప్, ఇతర రక్షణ చట్టాలపై చైతన్యం కలిగిస్తున్నాయి. ఎస్పీ ఆదేశాలతో ప్రత్యేకంగా డ్రోన్లు కూడా వినియోగిస్తున్నాం. జిల్లాలో ఏడు లక్షల మందికిపై గా శక్తి యాప్ వినియోగిస్తున్నారు.

-మహబూబ్ బాషా, దిశ డీఎస్పీ

ఎరువులు వచ్చాయోచ్..!

అనంతపురం అర్బన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు 2152 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు ఏడీఏ అల్తాఫ్ అల్లాఖాన్ పేర్కొన్నారు. ఇందులో 10-26-26 రకం ఎరువులు 1316 మెట్రిక్ టన్నులు, అమ్మోనియం సల్ఫేట్ ఎరువులు 836 మెట్రిక్ టన్నులు వచ్చాయన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఏపీ మార్క్‌ఫెడ్, హోల్‌సెల్, రిటైల్ డీలర్లకు ఎరువులు కేటాయిస్తామని తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు నవోదయ విద్యార్థిని


అర్పన

తనకల్లు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కంటిక్రాస్‌కు చెందిన అర్పన షాట్‌పుట్ అండర్- 19లో జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ఆమె తండ్రి శివ బుధవారం తెలిపారు. తన కుమార్తె అన్నమయ్య జిల్లా వలసపల్లి వద్ద ఉన్న నవోదయ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నట్లు తెలిపారు. కళాశాల తరపున నెల్లూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో తన కుమార్తె ప్రతిభ చూపిందన్నారు. అలాగే కర్ణాటకలోని గడగ్ లో నిర్వహించిన పోటీల్లో విశేషంగా రాణించి జాతీయ జట్టుకు ఎంపికైందన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఝూన్సీలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొననున్నట్లు తెలిపారు.

నిండిన జీడిపల్లి

- ఆరు రోజుల్లోనే మరువ పారిన రిజర్వాయరు
- విస్తరణ పనులతోనే త్వరగా...


జలహారతి ఇస్తున్న తహసీల్దార్ అనిల్ కుమార్, హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు

గుంతకల్లు/బెళుగుప్ప, జూలై 30(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా వైడెనింగ్ సామర్థ్యం ఏమిటో ఆరు రోజుల్లోనే తెలిసివచ్చింది. సాధారణంగా పన్నెండు, పదమూడు రోజుల్లో నిండాల్సిన జీడిపల్లి రిజర్వాయరు, కాలువ వైడెనింగ్ కారణంగా ఆరు రోజుల్లోనే నిండి మరువ పారుతోంది. హంద్రీనీవా తొలిదశ కెనాల్‌లో అంతిమ ప్రదేశమైన జీడిపల్లి రిజర్వాయరు 1.60 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగి ఉంది. ప్రతి ఏటా దాదాపు 0.80 టీఎంసీల నీటిని నిల్వ ఉంచుతారు. ఈనెల 24న జీడిపల్లికి కృష్ణా నీరు చేరింది. 30న మధ్యాహ్నం 3 గంటలకు రిజర్వాయరు నిండి మరువ పారింది.

సగం రోజుల్లోనే..

వైడెనింగ్ జరగనప్పుడు జీడిపల్లి రిజర్వాయరు 0.80 టీఎంసీల నీటి నిల్వ నుంచి 1.6 టీఎంసీలు చేరడానికి దాదాపు 12 నుంచి 13 రోజులు పట్టేది. గత ఏడాది గరిష్ఠంగా 800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో జీడిపల్లి రిజర్వాయరుకు నీరు చేరింది. వైడెనింగ్ పూర్తయిన కారణంగా ప్రస్తుతం రెండువేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రిజర్వాయర్‌కు లభించింది. దీంతో ఆరు రోజుల్లోనే రిజర్వాయరు నిండి మరువ పారుతోంది. దీంతో తహసీల్దార్ అనిల్‌కుమార్, వీఆర్వో యర్రిస్వామి, హంద్రీనీవా అధికారులు ఈఈ నాగరాజు, ఎస్ఈ రాజస్వరూప్, ఏఈఈ పృథ్వీసాగర్, పీఏబీఆర్‌కు నీటిని విడుదల చేసి, మరువ వద్ద గంగపూజ చేసి హారతి నిచ్చారు.

రోడ్లు విస్తరించాలని కేంద్రమంత్రికి వినతి


కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో చర్చిస్తున్న రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి, ఎన్టీఆర్ జిల్లాల్లోని రోడ్లను విస్తరించాలని కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీని కోరినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. న్యూఢిల్లీలో కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్‌గడ్కరీని కలిసి వివిధ అంశాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో రూ.9500కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాన, ప్రారంభోత్సవం కోసం ఆగస్టు 2న రాష్ట్రానికి నితిన్‌గడ్కరీ వస్తున్నట్లు వెల్లడించారు.

కూటమి పాలనలోనే పంచాయతీల అభివృద్ధి


మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

అనంతపురం క్రైం, జూలై 30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే పంచాయతీల అభివృద్ధి జరిగిందని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. అనంతపురం వచ్చిన ఆయన ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.6 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశారన్నారు. వైసీపీ హయాంలో పంచాయతీలకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. మాజీ సీఎం జగన్ పంచాయతీను నిర్వీర్యం చేశారంటూ మండిపడ్డారు. 2024-25 ఏడాదికి సంబంధించి 2వ విడత 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ. 1120 కోట్లు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఏపీ పీఆర్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూషణ్, ఉమ్మడి జిల్లా పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షుడు రంగయ్య, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర నాయకులు ఇస్మాయిల్, మీనాక్షినాయుడు పాల్గొన్నారు.

75 శాతం రాయితీతో గడ్డి జొన్నలు

అనంతపురం అర్బన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు 75 శాతం రాయితీతో గడ్డి జొన్నలు పంపిణీ చేస్తామని పశుసంవర్థక శాఖ ఇన్‌చార్జి జేడీ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. కేజీ గడ్డి జొన్నలు పూర్తి ధర రూ.92లు, ఇందులో రూ.69లు (75 శాతం) రాయితీపోను రైతు వాటా కింద రూ.23లు చెల్లించాలన్నారు. జిల్లాకు ఈసారి 77 మెట్రిక్ టన్నులు గడ్డి జొన్నలు సరఫరా చేశారన్నారు. గడ్డి జొన్నలు కావాల్సిన రైతులు స్థానిక రైతు సేవా కేంద్రంలో డబ్బులు చెల్లించి, తీసుకోవాలని సూచించారు.

ఈ పంట నమోదు పక్కాగా చేయాలి

అనంతపురం అర్బన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉద్యాన తోటల ఈ పంట నమోదు ప్రక్రియను పక్కాగా చేయాలని ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఉమాదేవి ఆదేశించారు. బుధవారం ఉద్యాన శాఖ జిల్లా కార్యాలయం నుంచి ఉద్యాన శాఖ ఏడీ దేవానంద్, టెక్నికల్ హెచ్ఓ రత్నకుమార్‌లతో కలిసి ఉద్యాన అధికారులతో ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతుల వారిగా ఏఏ రకాల ఉద్యాన పంటలు సాగు చేశారన్న వివరాలతోపాటు తోటలో రైతును నిల్చొబెట్టి ఫోన్ తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. నిర్దేశించిన సమయంలోగా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

గార్మెంట్స్ పరిశ్రమ ఏర్పాటు అభినందనీయం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి


వివరాలు అడిగి తెలుసుకుంటున్న మాధవ్, పార్థసారథి

పామిడి, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గజరాంపల్లి గ్రామంలో వ్యాలీ గ్రీన్ గార్మెంట్స్ పరిశ్రమను ఏర్పాటు చేయడం అభినందనీయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి పేర్కొన్నారు. గ్రామంలో టీడీపీ నాయకుడు, పీజేఆర్ ట్రస్టు చైర్మన్ పెరుమాళ్ల జీవానందరెడ్డి ఏర్పాటు చేసిన వ్యాలీ గ్రీన్ గార్మెంట్స్ పరిశ్రమను బుధవారం వారు సందర్శించారు. గార్మెంట్స్‌లో దుస్తుల తయారీ విధానాన్ని పరిశీలించారు. గ్రామీణ ప్రాంతంలో పరిశ్రమను నెలకొల్పి ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చి మహిళల్లో ఆత్మస్థైర్యం నింపడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రామకృష్ణ

అనంతపురంరూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా లౌకికవాదులు, ప్రజాతంత్రవాదులు, కులసంఘాల నాయకులు, వామపక్ష భావజాలంకలిగిన ప్రతిఒక్కరూ మతోన్మాదశక్తుల నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్ ఆధ్వర్యంలో మండలంలోని సోములదొడ్డి గ్రామ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అందరం సమైక్యంగా ఉన్నామంటే దానికి ప్రధాన కారణం అంబేడ్కర్ రాసిన రాజ్యాంగమన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు కమ్యూనిస్టులు, అంబేడ్కర్ వాదులు, ప్రజాతంత్రవాదులు కసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మల్లికార్జున, రామకృష్ణ, నారాయణస్వామి, రమేష్, నరేష్, రాజేష్ గౌడ్, కుళ్లాయిస్వామి, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


సంతోష్‌నాయక్ (ఫైల్)

గోరంట్ల, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుట్టిపల్లి తండాకు చెందిన సంతోష్‌నాయక్ (25) అనుమానాస్పద స్థితిలో బుధవారం మృతి చెందినట్లు సీఐ శేఖర్ తెలిపారు. గంగంపల్లి తండాకు చెందిన శంకర్‌నాయక్ కుమారుడు సంతోష్‌నాయక్‌కు ఐదేళ్ల కిందట గుట్టిపల్లితండాకు చెందిన విజయలక్ష్మీబాయితో వివాహం జరిగింది. భార్యతో అత్తగారి ఊరిలోనే నివాసముంటున్నారు. వారికి ఐదునెలల కుమారుడున్నాడు. సంతోష్‌నాయక్ బుధవారం ఉదయం భార్య కొడుతోందని, తండ్రికి ఫోన్ చేసి తెలిపాడన్నారు. తరువాత సంతోష్‌నాయక్ మృతి చెందడం పలు అనుమానాలకు దారి తీస్తోందన్నారు. కేసు నమోదు చేసి, శవాన్ని పెనుకొండకు తరలించినట్లు సీఐ తెలిపారు.

అంధటీచర్లకూ ముఖ హాజరు తప్పనిసరి

- విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు



విద్యాశాఖ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వుల కాపీ

అనంతపురం విద్య, జూలై30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న అంధటీచర్లు కూడా ఇక మీదట ముఖ హాజరు వేయాలల్సిందేనంటూ రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న 1331మంది అంధ టీచర్లు ముఖహాజరు వేసేవారు కాదు. ఇందులో జడ్పీ, మండల పరిషత్‌లోనే 1079మంది టీచర్లు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. మిగిలిన వారందరూ మున్సిపల్, గవర్నమెంట్, మోడల్ స్కూళ్లు, రెసిడెన్షియల్ స్కూల్ టీచర్లు ఉన్నారు. దీంతో వందశాతం టీచర్ల ముఖహాజరు నమోదు కావడం లేదు. అందుకే రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ అంధటీచర్లకు మినహాయింపు రద్దు చేశారు. వారు తప్పకుండా ముఖహాజరు వేయాలని వెబెక్స్‌లో కూడా ఆర్జేడీ, డీఈఓలకు ఆదేశాలు చేశారు. దీంతో తక్కువ అంధత్వం ఉండి, పాత నిబంధనలను అడ్డుపెట్టుకొని ముఖహాజరుకు దూరంగా ఉంటూ వస్తున్న కొందరు ఉలిక్కి పడుతున్నారు. ఇంతకాలం ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఈఓలను వివిధ రకాలుగా మచ్చిక చేసుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరించిన తీరుకు బ్రేక్ పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో సెలవులో వెళ్లినా ముఖ హాజరు లేదు కాబట్టి ఉన్న ఒప్పందాల మేరకు హాజరు రిజిస్టర్‌లో సంతాకాలు చేసే వారనే ఆరోపణలు ఉన్నాయి. ఎక్కువగా అనంతపురం, అనంతపురం రూరల్, బుక్కరాయసముద్రం, రాప్తాడు మండలాల్లో ఇలాంటి వ్యవహారాలు అధికంగా జరిగినట్లు సమాచారం. ప్రస్తుతం కమిషనర్ ఉత్తర్వులతో వారంతా తప్పనిసరిగా పాఠశాలకు సమయానికి వెళ్లాల్సి వస్తోంది. హెచ్‌ఎంలేదా తోటి టీచర్ల సహకారంతో ముఖహాజరు వేయాల్సి వస్తోంది.

'టీడీపీతోనే వక్కలిగుల అభివృద్ధి'


సమావేశంలో మాట్లాడుతున్న వక్కలిగ సంఘం నాయకులు

మడకశిర టౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వక్కలిగలు తెలుగుదేశం పార్టీతోనే వివిధ రంగాల్లో రాణిస్తున్నారని వక్కలిగ సంఘం రాష్ట్ర కన్వీనర్ వీఎం పాండురంగప్ప అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వక్కలిగ సముదాయ భవనం నిర్మాణం కోసం రూ.5లక్షలను ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు విరాళం ఇవ్వడంతో కృతజ్ఞతలు తెలిపారు. గతంలో కూడా తెలుగుదేశం ప్రభుత్వావ హయాంలో నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. పట్టణంలో కెంపేగౌడ విగ్రహ ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీలను వక్కలిగ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, ఎన్.గణేష్, కుమారస్వామి, బసవరాజు, శివకుమార్, భాస్కర్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్ పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

నండూరి పార్థసారథి (జయంతి)



తెలుగు పాఠకలోకానికి సాహితీ ప్రియులకు నంపాసా చిరపరిచితులైన నండూరి పార్థసారథి 1939 జూలై 31న కృష్ణాజిల్లా ఆరుగొలను గ్రామంలో జన్మించారు. ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకుడు నండూరి రామ్మోహనరావు ఆయన సోదరుడు. ముళ్ళపూడి వెంకటరమణ భార్య శ్రీదేవి.... పార్థ సారథికి సోదరి. ఆంధ్రప్రభ దినపత్రిక, ఆంధ్ర ప్రభ వారపత్రికలో పనిచేశారు. ఆయన మొదటి కథ 1957లో ప్రచురితమైంది. వివిధ పత్రికలలో అనేక కథలు, ధారావాహికలు, నవలలు, నాటక, సంగీత, సాహిత్య రంగాలపై వందలకొద్దీ వ్యాసాలు, సమీక్షలు ప్రకటించారు. 2000 నుంచి 2009 వరకు రసమయి అనే సాంస్కృతిక మాసపత్రికను స్వీయ సంపాదకత్వంలో ప్రచురించారు. పలు గౌరవాలు అందుకున్నారు. 2024 జూన్ 14న కన్నుమూశారు.

ఇగ్నేషియస్ ఆఫ్ లయోలా (వర్ధంతి)



'సెయింట్ ఇగ్నేషియస్ ఆఫ్ లయోలా 1491 అక్టోబరు 23న జన్మించారు. స్పానిష్ బాస్కె క్యాథలిక్ ప్రీస్ట్, వేదాంతవేత్త. ఆధ్యాత్మిక విధానమైన 'సొసైటీ ఆఫ్ జీసస్' వ్యవస్థాపకులలో ఒకరు. 1541లో ప్యారిస్‌లో సుపీరియర్ జనరల్‌గా పేరొందారు. ధ్యానం, మానసిక అభ్యాసాలతో ఆధ్యాత్మిక వేత్తగా రాణించి 'సెయింట్' (పవిత్ర వ్యక్తి)గా గుర్తింపు పొందారు. 1556 జూలై 31న కన్నుమూశారు.

అల్లు రామలింగయ్య (వర్ధంతి)



'పద్మశ్రీ' గ్రహీత అల్లు రామలింగయ్య 1922 అక్టోబరు 1న పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో జన్మించారు. సినీ నటుడు, నిర్మాత. నాటకాల్లో నటిస్తూనే మహాత్మాగాంధీజీ పిలుపుతో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు కెళ్లాడు. అనంతరం సినిమాల్లో కామెడీ విలన్, క్యారెక్టర్ పాత్రలతో 1030 సినిమాలలో నటించి మూడు తరాల ప్రేక్షకులను అలరించారు. రఘుపతి వెంకయ్య అవార్డు తదితర పురస్కారాలు అందుకున్నారు. 2013లో భారత చలనచిత్ర పరిశ్రమ వందేళ్లు పూర్తైన సందర్భంగా విడుదలైన 50 తపాలాబిళ్లలలో ఆయన జ్ఞాపకార్థం ఒకటి ఉంది. 2004 జూలై 31న కన్నుమూశారు.

మహమ్మద్ రఫి (వర్ధంతి)



'పద్మశ్రీ' గ్రహీత, ప్రఖ్యాత నేపథ్య గాయకుడు మహమ్మద్ రఫి 1924 డిసెంబరు 24న పంజాబ్ రాష్ట్రంలో కోట్లా సుల్తాన్‌సింగ్ ప్రాంతంలో జన్మించారు. తనదైన గాత్రంతో శ్రోతలను అలరించారు. శృంగార, విషాద, గజల్స్, భజనలు సహా అన్ని రకాల క్లాజికల్ పాటలకు ఆయన పెట్టింది పేరు. ప్రత్యేకించి హిందీలో శంకర్ - జైకిషన్ సంగీత దర్శకుల ద్వయంతో కలసి పాడిన పాటలు సూపర్ హిట్‌గా నిలిచాయి. హిందీ, ఉర్దూ, మరాఠీ, తెలుగు సహా 17 భాషలలో 7వేలకుపైగా పాటలు పాడారు. ఒక జాతీయ అవార్డు, 4 ఫిల్మ్‌ఫేర్ సహా 'బెస్ట్ సింగర్ ఆఫ్ ది మిలీనియమ్' ఇతర పురస్కారాలు అందుకున్నారు. 1980 జూలై 31న కన్నుమూశారు.

జేకే రౌలింగ్ (పుట్టినరోజు)



కలం పేరు 'జేకే రౌలింగ్'తో గుర్తింపు పొందిన జొఅన్నె రౌలింగ్ 1965 జూలై 31న జన్మించారు. బ్రిటీష్ దేశ రచయిత్రి, మానవతావాది, సినీ నిర్మాత, బుల్లితెర నిర్మాత, స్క్రీన్ రైటర్‌గా రాణించారు. హారీ పాటర్ నటించిన ఫాంటసీ సిరీస్‌కు ఆమె రచనలు చేశారు. రాబర్ట్ గల్‌బ్రైత్ పేరిట క్రైం ఫిక్షన్‌లు రాశారు. అత్యధిక ప్రభావిత బ్రిటీష్ మహిళల్లో ఒకరుగా నిలిచారు. సాహిత్య, మానవతా సేవలకు 'ఆర్డర్ ఆఫ్ ది కంపానియన్స్ ఆఫ్ హానర్' గుర్తింపు పొందారు. రాయల్‌సొసైటీలో గౌరవ సభ్యురాలు. కొవిడ్ క్లిష్టంలో సామాజిక సేవలందించారు. 2021లో కోర్మరన్ స్ట్రైక్ సిరీస్ 5వ వాల్యూమ్‌కు థ్రిల్లర్ ప్రైజ్ అందుకున్నారు.

కియ పరిశ్రమలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి



మాట్లాడుతున్న యాదవ కార్పొరేషన్ డైరెక్టర్, రైతులు

పెనుకొండ టౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): కియ పరిశ్రమలో భూములు కోల్పోయిన రైతుల పిల్లలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, స్థానిక రైతులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని అఫిషియల్ క్లబ్ ఆధ్వర్యంలో భూములు కోల్పోయిన రైతులతో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. మంగళవారం పెనుకొండ మండలం దుద్దేబండ క్రాసవద్ద ఉన్న కియ అనుబంధ పరిశ్రమ వద్ద భూములు కోల్పోయిన రైతులు స్థానిక ప్రజలతో కలిసి నిరసన తెలిపామని, తమకు ఉద్యోగ, ఉపాధి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కియకు భూములు ఇచ్చింది తామైతే పెత్తనం వైసీపీ నాయకులదే జరుగుతోందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉద్యోగ ఉపాధి కల్పించి కరువురహిత జి ల్లాగా మార్చాలనే సంకల్పంతో తాము కియాకు భూమి, ఇచ్చామని నేడు ఆ భూములు పోగొట్టుకున్న కుటుంబాలు ఉపాధిలేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. పలుమార్లు స్థానికంగా ఉన్నవారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని మంత్రి సవితను ఏడాదిగా వేడుకుంటున్నా పట్టించుకోలేదని, ఈ క్రమంలో తామే కడుపుమండి కంపెనీవద్ద నిరసన తెలిపామన్నారు. వైసీపీ అరాచకాలపై పెద్దఎత్తున రైతులు, స్థానిక ప్రజలతో కలిసి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌తో కలిసి తమ గోడు వెల్లగక్కుతామన్నారు. కార్యక్రమంలో రైతులు పెద్దన్న, సోము, వాసుదేవరెడ్డి, రామాంజి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందాలి

» ఎమ్మెల్యే మంజుళ లింబావళి



గ్రామసభను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మంజుళ లింబావళి

మహదేవపుర, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందేలా అధికారులు కృషి చేయాలని ఇందులో ఎలాంటి రాజకీయాలు వద్దని ఎమ్మెల్యే మంజుళ లింబావళి సూచించారు. నియోజకవర్గంలోని మండూరు గ్రామపంచాయతీలో 2025-26 వార్షిక తొలి గ్రామసభను ప్రారంభించి మాట్లాడుతూ ప్రతిశాఖ ద్వారా లభించే సదుపాయాలు అర్హులందరికీ లభించాలన్నారు. సంబంధితశాఖల అధికారులు ఆయా పథకాల ప్రయోజనాలను ప్రజలకు సమగ్రంగా వివరించాలన్నారు. అనంతరం ప్రజల సమస్యలను ఆలకించారు. త్వరలోనే రోడ్డు, డ్రైనేజీ, తాగునీరు సహా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు హామీ ఇచ్చారు. సమావేశంలో ఈఓ వసంతకుమార్, పీడీఓ నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి వనరులను సంరక్షించాలి

భావితరాలకోసం నీటి వనరులను సంరక్షించాల్సిన బాధ్యతి ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే మంజుళ అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలోని జ్యోతిపుర, లఘుమేనహళ్ళి, బొమ్మేనహళ్ళి, నింబెకాయపుర, కాటంనల్లూరు, కోనదాసపుర, బిదిరె అగ్రహార, కన్నమంగల, చిక్కబనహళ్ళి గ్రామాలలో చెరువుల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఆమె మాట్లా డుతూ చెరువులు, కుంటలను కాపాడుకోవాలన్నారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో జీవనం కష్టతరం కానుందన్నారు. నియోజకవర్గంలో ఎన్నో చెరువులు ఉన్నాయని, వాటిని దశలవారీగా అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామాలలోని చెరువులు వ్యవసాయానికి మూలంగా ఉన్నాయన్నారు. చెరువులను నమ్మి జీవనం సాగిస్తున్నారన్నారు. రైతుల బతుకులో మోము రావాలంటే చెరువుల మనుగడ అవసరం ఎంతైనా ఉందన్నారు. కొన్నిచోట్ల చెరువులు ఆక్రమణకు గురయ్యాయని వాటిని తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో దొడ్డబనహళ్ళి పంచాయతీ అధ్యక్షుడు లోకేశ్, రూరల్ హోబళి బీజేపీ ప్రధాన కార్యదర్శి కేవీ నాగరాజ్, ముఖ్యులు వేణు, బొమ్మేనహళ్ళి మునిరాజు తదితరులు పాల్గొన్నారు.



చెరువుల అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

వైభవంగా తులసీరామ ఆలయ రాజగోపుర సంప్రోక్షణ



కలశాలకు పూజలు చేస్తున్న పండితులు



ఆలయ రాజగోపురం

ముళబాగిలు, జూలై 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జ్యోతినగర్‌లోని తులసిరామ దేవాలయంలో నూతనంగా నిర్మించిన మహాద్వారం, రాజగోపుర మహాసంప్రోక్షణ నిమిత్తం బుధవారం విశేషపూజలు కొనసాగాయి. 1943లో గాణిగ సామాజిక వర్గానికి చెందిన మళిగె రంగస్వామి దాస ఈ ఆలయాన్ని నిర్మించారు. అప్పటినుంచి నిత్యం ఇక్కడ పూజలు కొనసాగుతున్నాయి. ప్రతి సంవత్సరం శ్రీరామకోటి కార్యక్రమం నిర్వహిస్తారు. వేలాదిమంది భక్తులు పాల్గొంటారు. రాజగోపుర సంప్రోక్షణ కార్యక్రమంలో భాగంగా ఉదయం యాగశాల ప్రవేశం, పుణ్యాహవచనం, వివిధ హోమాలు నిర్వహించారు. ఆలయంలోని వేంకటేశ్వర, పద్మావతి, సీతారామలక్ష్మణ హనుమత్ సమేత వినాయక విగ్రహాలకు పూజలు చేశారు. అర్చకులు గోపినాథ్, ఎంఎస్ రవికుమార్ల నేతృత్వంలో పూజా కైంకర్యాలు జరిగాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎంజే మల్లి కార్జున్, సంచాలకులు ఎంఎస్ రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

కేఐఏడీబీ భూస్వాధీన ప్రక్రియపై అభ్యంతరం



నిరవధిక నిరసనలో కరవే, రైతుసంఘం నాయకులు తదితరులు

దొమ్మసంద్ర, జూలై30(ఆంధ్రజ్యోతి): సర్జాపుర హోబళిలో సారవంతమైన సాగు భూ ములను పరిశ్రమల అవసరాల కోసం స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమైన కేఐఏడీబీ తీరును వ్యతిరేకిస్తూ గ్రామస్థులు, రైతులు నిరవధిక ధర్నా చేపట్టారు. ముత్తనల్లూరు బస్టాండ్ వద్ద చేపట్టిన ధర్నాలో కరవే శివరామగౌడ వర్గం కార్యకర్తలు, ఆనేకల్ తాలూకా వివిధ రైతుసంఘాల నాయకులు మద్దతు ఇచ్చారు. కరవే శివరామేగౌడ వర్గం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోకేశ్‌గౌడ మాట్లా డుతూ తాలూకాలోని అనేక ప్రాంతాలలో కేహెచ్ బీ, కేఐఏడీబీ సంస్థలు భూస్వాధీనం చేస్తున్నా రన్నారు. తద్వారా పరిశ్రమల పేరిట పర్యావరణ కాలుష్యం అధికమైందన్నారు. నీటి ఎద్దడి పెరుగు తోందన్నారు. అవసరమైన ఆనేకల్ తాలూకా బంద్ చేస్తామని, జాతీయ రహదారిపై రాస్తారోకో చేపడతామని హెచ్చరించారు. నిరసనలో ముత్తనల్లూరు గ్రామ పంచాయతీ మాజీ అధ్యక్షుడు విశ్వనాథ్‌రెడ్డి, జానపద గాయకుడు ఆనేకల్ రాజేశ్, కృష్ణరెడ్డి, తాలూకా పంచాయతీ మాజీ సభ్యులు పుష్ప వీఎస్ రెడ్డి, రైతు ప్రముఖులు అంబరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వ్యాఖ్యలపై 2న నిరసన



మాట్లాడుతున్న చిత్రావతి పోరాట సమితి నాయకులు

బాగేపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చిత్రావతి డ్యాంకు మాజీ సీఎం ఎస్ఎం కృష్ణ పేరు పెట్టాలన్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వ్యాఖ్యలను ఖండిస్తూ ఆగస్టు 2న నిరసన చేపట్టనున్నట్టు చిత్రావతి పోరాట సమితి నాయకుడు మునివెంకటప్ప తెలిపారు. పట్టణంలోని సుందరయ్యభవనంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తాలూకాలోని పరగోడు గ్రామ పంచాయతీలో చిత్రావతి నిర్మాణం జరిగింది సీపీఎం నేత, మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీరామరెడ్డి నేతృత్వంలోని పోరాటాల ఫలితంగానే అన్నారు. అయితే వారి సేవలను విస్మరిస్తూ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఒక్కసారిగా ప్రభుత్వ కార్యక్రమంలో మాజీ సీఎం ఎస్ఎం కృష్ణ పేరు పెడతామని ప్రకటించారన్నారు. ఆగస్టు 2న సీపీఎం, రైతుసంఘాలు, దళిత సంఘాలు, మహిళా సంఘాల నేతృత్వంలో నిరసన ఉంటుందన్నారు. హసిరుసేన రాష్ట్ర సమితి సభ్యులు లక్ష్మీనారాయణరెడ్డి మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీరామరెడ్డి చేసిన అభివృద్ధి సేవలను విస్మరించడం సరికాదన్నారు. డ్యాంకు శ్రీరామరెడ్డి పేరు కాకుండా మరొకరి పేరును పెట్టాలనుకోవడం సమంజసం కాదన్నారు. సమావేశంలో రఘురామరెడ్డి, చన్నరాయప్ప, అశ్వత్థప్ప, డీటీ మునిస్వామి, ముస్తాఫ, ఈశ్వరరెడ్డి, రఫీక్, సాయిజ్యోతి, చలపతి, కేవీ రామచంద్రప్ప, లక్ష్మణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్లకు తెలియకుండానే పనులు చేపడతారా..?

చైర్మన్, కమిషనర్‌పై వైసీపీ కౌన్సిలర్ల ఆగ్రహం



సమావేశం నుంచి బయటకు వస్తున్న కౌన్సిలర్లు

పెనుకొండ, జూలై 30(ఆంధ్రజ్యోతి): 'మా సొంత వార్డుల్లో మాకు తె లియకుండానే పనులు చేపడతారు. అజెండాలో ఏ అంశాలు పెడతారో చెప్పరు. అజెండా కాపీలను ముందుగా పంపరు. కౌన్సిలర్లంటే మీకు చు లకన.. అలాంటప్పుడు మేము సమావేశాలకు ఎందుకు రావాలి. టీ బి స్కెట్ తినడానికా..' అంటూ వైసీపీ కౌన్సిలర్లలో ఒక వర్గం కమిషనర్, చైర్మన్‌తో వాగ్వాదానికి దిగారు. అజెండా ఆమోదం తెలుపకుండానే స మావేశం నుంచి వాకౌంట్ చేశారు. బుధవారం స్థానిక నగర పంచాయ తీ కార్యాలయంలో చైర్మన్ ఉమర్‌ఫారూక్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముందుగా అజెండాలోని అంశాలను అధికారులు చదివి వినిపించారు. అనంతరం వైసీపీ కౌన్సిలర్లలో ఓ వర్గం సభ్యులైన సుధాకర్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ నందినిరెడ్డి, మరో 11మంది సభ్యులు మాట్లాడు తూ.. తమ వార్డులో తమకు తెలియకుండానే పనులు చేపడుతున్నారని పేర్కొన్నారు. ఏ విషయం తమకు తెలియకుండానే నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తాము వాకౌట్ చేస్తున్న ట్లు కమిషనర్‌కు వినతిపత్రం అందించి సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. ఈ విషయంపై కమిషనర్ సతీష్‌కుమార్, చైర్మన్ ఉమర్‌ఫారూక్ మాట్లాడుతూ.. సమావేశానికి అందరు కౌన్సిలర్లు హాజరైనట్లు సంతకాలు చేశారన్నారు. కొందరు వాకౌట్ చేసినప్పటికీ.. కొందరు అజెం డా ఆమోదానికి అనుకూలంగా సంతకాలు చేశారని తెలిపారు.



మాట్లాడుతున్న కన్వీనర్ శ్రీరాములు

అభివృద్ధికి అడ్డుపడుతున్న వైసీపీ కౌన్సిలర్లు

పెనుకొండ టౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మంత్రి సవిత పెనుకొండను అభివృద్ధి చేయాలని నిధులు తీసుకొస్తుంటే కొందరు వైసీపీ కౌన్సిలర్లు అడ్డుపడుతున్నారని టీ డీపీ పట్టణ కన్వీనర్ శ్రీరాములు పేర్కొన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆ యన మాట్లాడుతూ.. నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం జరిగిందని, అజెండాలో అభివృద్ధి పనులుంటే వాటిని తిరస్కరించడం సిగ్గుచేటన్నారు. ఇం దులో రూ.92లక్షలతో ఆర్టీసీ డిపో నుంచి శ్రీకృష్ణదేవరాయల వై జంక్షన్ వరకు సెం ట్రల్ లైటింగ్, మూడు గ్రామాలకు చెందిన రహదారి నిర్మాణం, మూడు గ్రామాలకు చెందిన డ్రైనేజీ, రోడ్డు ఉన్నాయన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు గిరి, హనుమంతు, రా మలింగ, రఘు, బాబుల్‌రెడ్డి త్రివేంద్ర, రమణమ్మ, క్రిష్ణమూర్తి, సమీ పాల్గొన్నారు.

మహేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి విశేష అలంకరణ

శిడ్లఘట్ట, జూలై 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొలువైన మహేశ్వరి అమ్మవారి ఆలయ జీర్ణోద్ధరణ అనంతరం తొలి వార్షికోత్సవం రెండు రోజులపాటు వైభవంగా జరిగింది. ఆలయాన్ని విశేషంగా అలంకరించారు. పూజలు, హోమాలు నిర్వహించారు. మంగళవారం నాగపంచమి కావడంతో తొలుత ఆలయశుద్ధి తర్వాత మామిడి తోరణాలతో అలంకరించారు. అమ్మవారికి క్షీరాభిషేకం, పసుపు, కుంకుమార్చన తర్వాత పలు రకాల పుష్పాల హారాలను అమ్మవారికి సమర్పించి ధూపదీపనైవేద్యాలు అర్పించారు. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు కార్యక్రమాలు కొనసాగాయి. అన్నదానం నిర్వహించారు. నగర సభ మాజీ సభ్యుడు మంజునాథ్, బాలకృష్ణ, స్థానిక ప్రముఖులు శివకుమార్, సంగీత విద్వాంసులు మంజుళ జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

హరిహర వీరమల్లు విజయంపై సంబరాలు



అభిమానులకు కేక్ పంపిణీ

బెంగళూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నటించిన 'హరిహరవీరమల్లు' సినిమా విజయవంతం కావడంపై పవన్‌కల్యాణ్, చిరు అభిమానులు సంబరాలు చేసుకున్నారు. బుధవారం మడివాళలోని సంధ్య టాకీస్ వద్ద కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. అంతకు ముందు ప్రెస్‌క్లబ్‌లో జనసేన పార్టీ ప్రచార కమిటీ కో-ఆర్డినేటర్ చైతన్య ఆదికేశవులు మాట్లాడుతూ చరిత్రలో జరిగిన దారుణ సంఘటనలను ఎదురొడ్డి పోరాడిన సాహస వీరులను గుర్తుంచుకునేలా సినిమా రూపొందించారన్నారు. హరిహర వీరమల్లు ద్వారా పవన్‌కల్యాణ్ సుదీర్ఘకాలం తర్వాత సినిమాలో నటించారన్నారు. సమావేశంలో అఖిల కర్ణాటక చిరంజీవి యువత రాష్ట్ర అధ్యక్షుడు బీజీ నాగేంద్ర, వైట్‌ఫీల్డ్ అభిమానసంఘం అధ్యక్షుడు ఉమేశ్, ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, విశాల్, చంద్రు, కిమ్‌రాజ్‌తోపాటు ఎంజేరప్ప పాల్గొన్నారు.

మహిళల్లో క్యాన్సర్ నియంత్రణకు అవగాహనే కీలకం



వైద్యబృందం

బెంగళూరు, జూలై30(ఆంధ్రజ్యోతి): మహిళల్లో ఎండోమెట్రియల్, అండాశయ క్యాన్సర్‌ల నియంత్రణకు అవగాహనే కీలకమని అపోలో గ్రూప్ అంకాలజీ విభాగం ముఖ్యులు దినేశ్ మాధవన్ అభిప్రాయపడ్డారు. అపోలోలో ఎండ్-ఓ-చెక్‌ను ప్రారంభించామన్నారు. ఈ విధానం ద్వారా 45ఏళ్ల పైబడిన మహిళలు నిర్దిష్టమైన పరీక్షలను, వైద్యుల సలహాలను పొందవచ్చునన్నారు. అపోలో ఆసుపత్రిలో ఈ విధానం అమలు చేస్తున్నామన్నారు. క్యాన్సర్ ఓ సైలెంట్ కిల్లర్‌గా ప్రబలుతోందని అందుకు అవగాహన కీలకమన్నారు. 2025 నాటికి దేశంలో 1.57 మిలియన్లమందికి ప్రబలే అవకాశం ఉందన్నారు. డాక్టర్ రాజీభట్ మాట్లాడుతూ మహిళల్లో ఎండోమెట్రియల్ క్యాన్సర్ పెరుగుతోందని, ప్రారంభదశలో గుర్తిస్తే నయం చేయవచ్చునన్నారు. సీనియర్ కన్సల్టెంట్ అరుణ ఆర్ పాటిల్‌తోపాటు పలువురు వైద్యనిపుణులు ఉదయ్ దవడ, గోవిందయ్య యతీశ్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, సినీ నటుడు, మాజీ ఎమ్మెల్సీ

మడకశిర టౌన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్‌కు దీటుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జరిగిన స్కూలు కమిటీ సమావేశానికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, కామెడీ నటుడు రఘుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చదువు మనిషికి విలువ, గౌరవం పెంపొందిస్తుందని, ప్రతి విద్యార్థి బాధ్యతగా చదువుకోవాలని సూచించారు. వైసీపీ పాలనలో విద్యావ్యవస్థను నిర్వీర్యం చేశారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నట్లు తెలిపారు. విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక రకాలుగా ప్రోత్సహిస్తుందని, ప్రతి విద్యార్థి ప్రభుత్వం అందించే సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి కష్టపడి కాక ఇష్టపడి చదవాలని, అప్పుడే అనుకొన్న లక్ష్యం చేరుకొంటారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు, ప్రధానోపాధ్యాయులు శంకుతల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1624.80	1631.72
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1,01,537	1,31,821
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	94,488	93,684
నీటి నిల్వ (టీఎంసీలు)	75.84	100.64

నాగప్పకు ప్రత్యేక పూజలు



కంప్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): బుక్కసాగర వద్ద వెలసిన ఏళుపడగల నాగప్ప ఆలయంలో బుధవారం షష్ఠి సందర్భంగా పురోహితుడు విశ్వనాథ్ ప్రత్యేక పూజలు చేపట్టారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారికి పూజలు చేశారు. ప్రతిషష్ఠికి ఆలయంలో పూజల్లో భక్తులు పాల్గొని పూజలు నిర్వహిస్తారని ఆలయ అధికారులు తెలిపారు. పుష్పాలతో స్వామివారికి ప్రత్యేకాలంకరణ చేశారు.

మోకా పోలీస్ స్టేషన్ తనిఖీ



మోకా పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఐజీపీ వర్తిగా కటియార్

బళ్లారిరూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని మోకా పోలీస్ స్టేషన్‌ను బుధవారం నూతన ఐజీ వర్తిగా కటియార్ తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పలు కేసులకు సంబంధించి వీలైనంత త్వరలో పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. పోలీసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ డాక్టర్ శోభారాణి, డీఎస్పీ సంతోష్ చౌహాన్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రుద్రప్ప, ఎస్ఐ కాళింగ పాల్గొన్నారు.

నరేగా కూలీలకు వేతనం మంజూరు చేయాలి

● లోక్‌సభలో ఎంపీ తుకారాం



లోక్‌సభలో మాట్లాడుతున్న ఎంపీ తుకారాం

బళ్లారి జూలై 30(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో నరేగాపథకం కింద కూలీలు చేసిన పనులకు వేతనం అందక ఇబ్బంది పడుతున్నారని లోక్‌సభ సభ్యుడు తుకారాం అన్నారు. బుధవారం ఆయన లోక్‌సభ జీరో అవర్‌లో మాట్లాడుతూ.. నరేగా పథకం కింద చేసిన పనికి కూలి డబ్బులు అందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 14,603కోట్లు నరేగా నిధులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని వెంటనే వవిడుదల చేయాలని ఆయన కోరారు.

10న వ్యసన రహిత దినోత్సవాన్ని నిర్వహిద్దాం

హోస్పేట, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఎంఎస్‌సీ డాక్టర్ మహంత్ శివయోగి స్వామీజీ జయంతి సందర్భంగా 10వ తేదీన కలెక్టర్ కార్యాలయం హాలులో సమాచార, ప్రజా సంబంధాల శాఖ, మద్యపానీయాల నియంత్రణ బోర్డు ద్వారా వ్యసన రహిత దినోత్సవాని జరుపుకుందామని సమాచార ప్రజాసంబంధాల శాఖ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ ధనుంజయప్ప బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హోస్పేట ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప హాజరవుతారన్నారు. కార్యక్రమానికి కలెక్టర్ ఎంఎస్ దివాకర్ అధ్యక్షత వహిస్తారని తెలిపారు. జిల్లా పంచాయతీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నోంగ్‌జోయ్ మహ్మద్‌అక్రమ్ అలీషా, ఎస్పీ ఎస్ జాహ్నవి, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ హెచ్‌ఎన్‌ఎఫ్ ఇమామ్ నియాజీ, మున్సిపల్ కౌన్సిల్ ఛైర్మన్ ఎస్ రూపేష్‌కుమార్ అతిథులుగా హాజరవుతారన్నారు.

మన విద్యపై విదేశీయుల్లో పెరుగుతున్న ఆసక్తి

● విద్యా విప్లవంలో దేశం ముందంజలో ఉంది

● ఎస్‌కేయూ 16వ సంస్థాపన దినోత్సవాల్లో వక్తలు

బళ్లారి, జూలై30(ఆంధ్రజ్యోతి): దేశంలో విద్యావిప్లవం నడుస్తోంది. విద్యలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇక్కడ విద్యను అభ్యసించేందుకు విదేశీ విద్యార్థులు వస్తున్నారంటే ఎంతటి మార్పువచ్చిందో గుర్తు చేసుకోవాలని ఏపీలోని సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ రిటైర్డు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ తేజస్విని కత్తిమణి అన్నారు. విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం 16వ సంస్థాపన దినోత్సవం బుధవారం వైస్‌చాన్సలర్ మునిరాజు అధ్యక్షతన నిర్వహించారు. తేజస్విని మాట్లాడుతూ విద్యలో చాలా మార్పులు వస్తున్నాయన్నారు. విద్యార్థులు విద్యావిప్లవం ఎదుర్కోక తప్పదని అన్నారు. నేడు దేశంలో విద్యాభ్యాసం ఉన్నత శిఖరానికి చేరిందన్నారు. ఇంతకుముందు



ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్యం



మాట్లాడుతున్న రుద్రేష్

బళ్లారి శ్రీకృష్ణదేవ రాయ యూనివర్సిటీలో రిజిస్ట్రార్‌గా పనిచేసి ప్రస్తుతం రాష్ట్రస్థాయిలో ఇరిగేషన్ అభివృద్ధి శాఖలో పనిచేస్తున్న రుద్రేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థి దశ అనేది ప్రతి ఒక్కరికీ కీలకమన్నారు. ఉన్నతస్థాయికి చేరేందుకు ఇక్కడే పునాది పడుతుందన్నారు. అందుకు విద్యార్థులు మంచి అలవాట్లు, విద్యను అభ్యసించి ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. విజయనగర శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీలో చదివే విద్యార్థులు శ్రీకృష్ణదేవరాయలు లాంటి గొప్ప చాతుర్యత సంపాదించుకోవాలన్నారు. యూనివర్సిటీలో అనేక భాషలు ఉన్నాయని, ఒక్క ప్రాంతీయ భాషానేకాకుండా విదేశీ భాషనుకూడా నేర్చుకోవాలని సూచించారు. వైస్ చాన్సలర్ మునిరాజు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. యూనివర్సిటీలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తామని అన్నారు. ప్రస్తుతం యూనివర్సిటీలో 29 విభాగాలు ఉన్నాయని భవిషత్తులో 45కు పెంచుతామని అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ నాగరాజు, మూల్యాంకనం ప్రొఫెసర్ ఎన్.ఎం. సాలి, ఫైనాన్స్ ఆఫీసర్ నాగరాజు, ప్రొఫెసర్ ఎన్. శాంతనాయక్, సిండికేట్, అకడమిక్ కౌన్సిల్ సభ్యులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అదుర్స్ అనిపించాయి.

పెండింగ్ బిల్లులను మంజూరు చేయండి

కంప్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): తాలుకాలో కొన్ని రోజుల క్రితం ఉప కాలువలు చేసిన పనులకు బిల్లులను ఇవ్వాలని రైతు సంఘం నాయకులు ముఖేష్ స్వామి, అయోధ్య, వెంకటేష్, గంగాధర డిమాండ్ చేశారు. చిన్న నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో ఏడీపీ నిధుల ద్వారా గ్రామాల్లో ఉపకాలువల్లో ఉన్న రైతన్నలే ఆ కాలువ గుండా సంఘం నేతలే నాణ్యమైన పనులు చేపట్టారన్నారు. కానీ నాణ్యమైన పనులు జరిగినా కొందరు జరగలేదని అడ్డుపడుతూ అధికారులు విరుద్ధంగా నోటీసులు వేయడం సరికాదని అన్నారు. ఇలా మున్ముందు చేస్తే అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. అధికారులు అలాంటి వారిని దృష్టిలో వుంచుకోకుండా పెండింగ్ బిల్లులను వెంటనే జారీ చేయాలని కోరారు. అనంతరం రైతులు దిశా సమితి సభ్యులు డాక్టర్ ఏసీ దానప్పకు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అభివృద్ధి పనులకు సహకరించాలని ఇలా మంజూరై బిల్లులకు అడ్డుపడటం సరికాదన్నారు. సంఘ సంస్థలైనా సరే ప్రజాప్రతినిధులైన సరే ఇలా చేయడం సరికాదన్నారు. అధికారులు కూడా ఇలాంటి వాటిని దృష్టిలో వుంచుకోకుండా



దిశా సమితి సభ్యుడు ఏసీ దానప్పకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చేసిన పనులకు వెంటనే బిల్లును మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌గౌడ, బసప్ప, గంగన్న, మురారి, అరుణ్‌కుమార్, నవీన్, తిమ్మప్ప, రవి, లక్ష్మన్న, మంజునాథ్ పాల్గొన్నారు.

హెల్మెట్‌తో భద్రత: ఎస్పీ

బళ్లారి సిటీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ భద్రత కోసం హెల్మెట్ ధరించాలని విజయనగర జిల్లా ఎస్పీ జాహ్నవి కోరారు. దీనిపై మరో వారం రోజుల పాటు ప్రజలకు అవగాహన కల్పిస్తామని ఆ తర్వాత తప్పనిసరిచేస్తామని అన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారు జరిమానా చెల్లించాల్సి ఉంటుందన్నారు. హొసపేట నగరంలో హెల్మెట్ అవగాహన మార్చ్‌ను జెండా ఊపి ప్రారంభించిన తర్వాత ఆమె మాట్లాడారు. గత పది రోజులుగా హెల్మెట్ వాడకం గురించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ద్విచక్ర వాహనంపై ముగ్గురు, అంతకంటే ఎక్కువ మంది ప్రయాణిస్తున్నట్లు గమనించామని, సర్వీస్ ఆటోలు అనుమతించిన దానికంటే ఎక్కువ మందిని ఎక్కించుకుంటున్నాయన్నారు. భవిష్యత్తులో దీనిని అనుమతించబోమని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించే అలవాటు చేసుకోవాలన్నారు. నగరంలోని వడకరాయ ఆలయం దగ్గర నుంచి జాతా ప్రారంభమై పెద్దమసీదు, గాంధీచౌక్, బస్టాండ్, కనకదాస సర్కిల్, పటేల్ నగర్, పునీత్ రాజ్‌కుమార్ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, కాలేజీ రోడ్డు, సాయిబాబా సర్కిల్, ఏపీఎంసీ సర్కిల్, టీబీ డ్యాం రోడ్డు, వాల్మీకి సర్కిల్ మీదుగా సాగి టౌన్ పోలీస్ స్టేషన్ చేరుకుంది. కార్యక్రమంలో డీవైఎస్పీ టి.మంజునాథ్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హులుగప్ప, పలువురు ఇన్‌స్పెక్టర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన జాతాలో పాల్గొన్న ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది

ద్విచక్రవాహనాల రాకపోకలు ప్రారంభం



కంప్లి కోట వద్ద ద్విచక్రవాహనాలకు అనుమతులు ఇచ్చిన అధికారులు



కంప్లి కోట వద్ద చికిత్స కోసం గంగావతికి వచ్చిన చిన్నారి తల్లిదండ్రులు

కంప్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నది వంతెనపై కంప్లి కోట వద్ద ఎట్టకేలకు బుధవారం ద్విచక్రవాహనాలు, ఆటోలకు అధికారులు అనుమతులు ఇచ్చారు. నదికి నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో అనుమతులు ఇచ్చారు. రెండు మూడు రోజులుగా వంతెనపై రాకపోకలు బంద్ కావడంతో కంప్లి నుంచి బుక్కసాగర మీదుగా గంగావతి చేరుకునే వారు. మధ్యాహ్నం సమయంలో ఒక చిన్నారి ఆరోగ్యం చికిత్స కోసం గంగావతి వెళ్లడానికి కంప్లి కోట వద్దకు రాగా అక్కడ ఉన్న పోలీసు సిబ్బంది అనుమతులు లేవని తెలుపగా అక్కడే ఉన్న కేంద్ర రాష్ట్ర దిశ సమితి సభ్యులు దానప్ప వెంటనే వంతెనకు సంబంధించిన అధికారులకు ఫోన్‌లో తెలిపి చిన్నారికి చికిత్స కల్పించాలని వంతెనపై చిన్నపాటి వాహనాలకు అవకాశం కల్పించాలని తెలుపగా అధికారులు స్పందించి అనుమతులు ఇచ్చారు.



కలెక్టర్ ప్రశాంత్ కుమార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న రైతుసంఘం నాయకులు

తాగునీటి సమస్య పరిష్కరించండి

బళ్లారి సిటీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీజే అబ్దుల్ కలాం రెసిడెన్షియల్ పాఠశాలలో తాగునీటి సౌకర్యం కల్పించాలని తుంగభద్ర రైతు సంఘం నాయకులు కలెక్టర్‌ను బుధవారం కలిసి వినతి పత్రం అందించారు. సంఘం అధ్యక్షుడు దరూరు పురుషోత్తమగౌడ మాట్లాడుతూ.. పాఠశాలలో 500మందికి పైగా విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది, వారి కుటుంబాలు సహా 700మందికిపైగా ఉన్నారన్నారు. పాఠశాల ప్రభుత్వ యాజమాన్యంలోని భవనం అయినప్పటికీ తాగునీటి వ్యవస్థ లేదన్నారు. సమస్యను పరిష్కరించేందుకు రెండు బోర్లు వేయించారన్నారు. వాటిలో అధిక మొత్తంలో ఫ్లోరైడ్ ఉందన్నారు. విద్యార్థుల్లో చర్మ సమస్యలు, ఇతర వ్యాధులు వస్తున్నాయన్నారు. సీసీ కెమెరా, యూపీఎస్/జనరేటర్, సెప్టిక్ ట్యాంక్, డైనింగ్ హాల్, వేడి నీటి సౌకర్యం కోసం సోలార్, లైబ్రరీకి అవసరమైన పుస్తకాలు లేవన్నారు. వెంటనే స్పందించి పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

సంతకాల సేకరణ



కలెక్టర్‌కు సంతకాల సేకరణ పత్రాలను అందిస్తున్న పౌర హక్కుల యాక్షన్ కమిటీ

బళ్లారి సిటీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): పౌర సౌకర్యాలను డిమాండ్ చేస్తూ పౌర హక్కుల యాక్షన్ కమిటీ(బీఎస్‌హెచ్‌ఎస్) ఆధ్వర్యంలో ప్రజల నుంచి సేకరించిన సంతకాలను జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్‌కు బుధవారం సమర్పించారు. వారు మాట్లాడుతూ.. బళ్లారి నగర సమస్యలను చర్చించి పరిష్కరించడానికి వీలైనంత త్వరగా సమావేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్నాన్ని స్వీకరించిన కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, పౌర హక్కుల యాక్షన్ కమిటీ ఆఫీస్ బేరర్లతో సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామని హామీ ఇచ్చారు.

బోనులో చిక్కిన ఎలుగుబంటి



ఎలుగుబంటిని బంధించిన అటవీశాఖ అధికారులు

బళ్లారిరూరల్, జూలై30(ఆంధ్రజ్యోతి): నగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలో మంగళవారం రాత్రి విమ్స్ మైదానం, సెంటిఫిలోమినా స్కూల్, సుధా క్రాస్, వాసవీ స్కూల్ తదితర ప్రాంతాల్లో ఎలుగుబంటి సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అటవీశాఖ అధికారులు ఎలుగుబంటి కోసం ఉదయం సిబ్బంది ఏర్పాటు చేసిన బోన్‌లో అది చిక్కింది. అటవీశాఖ అధికారులు ఎలుగుబంటిని పాలిటెక్నిక్ ప్రభుత్వ కళాశాల పక్కన ఉన్న పార్కులో పట్టుకున్నారు. దానిని అటల్ బిహారీ వాజ్‌పేయి పార్కుకు తరలించారు. ఎలుగుబంటిని పట్టుకోవడంతో ఆ ప్రాంత ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

కాచి, చల్లార్చిన నీటినే తాగండి

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రమేష్‌బాబు




కోట ప్రాంతాన్ని సందర్శించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రమేష్‌బాబు

కంప్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని జిల్లా ఆరోగ్యశాఖ అధికారి రమేష్‌బాబు సూచించారు. బుధవారం పట్టణంలోని కోట ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. అక్కడున్న ఆరోగ్య కేంద్రం సిబ్బందికి నదిఒడ్డున ఉన్న ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాకాలంలో రోగాలబారిన పడకుండా జాగ్రత్త వహించాలన్నారు. అలాగే ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీటిని నిల్వ వుండకుండా చూసుకోవాలన్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ ఇతర జ్వరాలు ప్రబలే ప్రభావం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు చిన్నపాటి జ్వరాలు వచ్చాయని, అశ్రద్ధ చేయకుండా దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. నదిఒడ్డున ఉన్న గ్రామాల్లో ఇప్పటికే ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అక్కడ కావలసిన చికిత్సలు డాక్టర్లు అందిస్తారని తెలిపారు. దానప్ప, నవీన్, చంద్రశేఖర్‌గౌడ్, బసవరాజు, విరుపాక్షి, చిన్న బసవరాజు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశానికి నేడు ఆఖరు

పెనుకొండ, జూలై 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ కోర్సు చేరడానికి ఈనెల 31 ఆఖరు తేదీ అని ప్రిన్సిపాల్ సుదర్శన్ ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పాసై ఇంకా అడ్మీషన్లు పొందని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కళాశాలలో నీట్, జేఈఈ వంటి పోటీల పరీక్షలకు అవసరమైన మెటీరియల్, శిక్షణ ఉచితంగా ఇస్తామన్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



మహాయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

లేపాక్షి, జూలై30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బిసలమానేపల్లిలో బుధవారం సీతారామచంద్ర లక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వివిధ ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు మహాయాగాన్ని నిర్వహించారు. గురువారం ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయం భక్తులతో నిండిపోయింది. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

హోసూరు జోన్

రెండు మార్గాల్లో బస్సు సర్వీసు పొడిగింపు

● మహిళ కోసం 8 కొత్త బస్సులు



బస్సు సర్వీసులకు పచ్చజెండా చూపుతున్న మంత్రి చక్రపాణి, ఎమ్మెల్యేలు తదితరులు

హోసూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రాంతాలలో రెండు మార్గాలలో సిటీ బస్సు రూట్‌లను పొడిగించారు. ఇదే సందర్భంగా 8 కొత్త మహిళా ఉదయం బస్సు సర్వీసులకు పౌర, ఆహార సరఫరాలశాఖ మంత్రి చక్రపాణి పచ్చజెండా చూపారు. ఎమ్మెల్యే ప్రకాశ్, మేయర్ సత్య, కలెక్టర్ దినేశ్‌కుమార్ పాల్గొన్నారు. తళి, శూలగిరి, వేపనపల్లి పంచాయతీ యూనియన్‌లలో రూ.13.49 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం అందివాడి క్రీడా మైదానంలో తమిళనాడు సీఎం హాజరు కానున్న కార్యక్రమ వేదికను పరిశీలించారు. తళి పంచాయతీ యూనియన్‌లో శూలగిరిపంచాయతీ యూనియన్, కామనదొడ్డి పంచాయతీ పరిధిలోని గ్రామాలలో రూ.7.56 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో బర్గూరు ఎమ్మెల్యే మతియళగన్, తళి ఎమ్మెల్యే రామచంద్రన్ పాల్గొన్నారు. హోసూరు నుంచి నందిమంగలం వెళ్లే బస్సును మావత్తూరుకు, హోసూరు నుంచి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వరకు రెండు బస్సు సర్వీసులను ప్రారంభించారు. తద్వారా విద్యార్థులు, ప్రజలు సుమారు 2,500మందికి ప్రయోజనం చేకూరనుంది. కార్యక్రమాలలో జిల్లా ఎస్పీ తంగదురై, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కవిత, హోసూరు సబ్ కలెక్టర్ ధనంజయన్ వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

రోబోటిక్ శస్త్రచికిత్సలు ప్రారంభం

హోసూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): హోసూరు కావేరి ఆసుపత్రిలో ఆధునిక రోబోటిక్ శస్త్రచికిత్సల్లో భా గంగా జాయింట్ రీప్లేస్‌మెంట్ యాక్షన్‌ప్లాన్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఆసుపత్రి గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయభాస్కరన్, మెడికల్ డైరెక్టర్ అరవిందన్, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్‌లు హేమంత్, డాక్టర్ శాంతకుమార్ మీడియాతో మాట్లాడుతూ సాధారణ సర్జరీ వల్ల వారం రోజులు ఉండాల్సి ఉంటుందని, రోబోటిక్ సర్జరీ వల్ల మూడు రోజులు ఉంటే చాలన్నారు. రోబోటిక్ శస్త్రచికిత్స ద్వారా నాణ్యతతోపాటు రోగి త్వరగా కోలుకుంటారన్నారు. జాయింట్ రీప్లేస్‌మెంట్ ఆపరేషన్‌లో కృష్ణగిరి, తిరుపత్తూరు, ధర్మపురి జిల్లాల్లో ఈ రకం సర్జరీ ఇదే మొదటిదన్నారు. ఈ సందర్భంగా వర్గీస్‌జాయ్, బిందుకుమారి, శ్రీరామజయం తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఆసుపత్రి నిర్వాహకులు

కారుణ్య నియామక పత్రం అందజేత

హోసూరు, జూలై30(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పూనపల్లి గ్రామానికి చెందిన నారాయణ, భార్య రేణుక ఇద్దరూ కొన్నిరోజుల క్రితం ఇంట్లో విద్యుదాఘాతంతో మృతి చెందారు. కారుణ్య ప్రాతిపదికన వారి కుమార్తె హర్షితకు నియామకపత్రాన్ని అందచేశారు. తళి బ్లాక్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా నియమించారు. మంత్రి చక్రపాణి, కలెక్టర్ దినేశ్‌కుమార్, ఎమ్మెల్యే ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాన్ని అందజేస్తున్న మంత్రి చక్రపాణి